"మధురమైన పిల్లలూ - మీరు ఎంతగా తండ్రిని స్మృతి చేస్తారో, అంతగా ఆత్మలోకి ప్రకాశము వస్తుంది, జ్ఞానవంతమైన ఆత్మ ప్రకాశవంతంగా అవుతుంది"

ప్రశ్న:- మాయ ఏ పిల్లలను కొద్దిగా కూడా విసిగించలేదు?

జవాబు:- ఎవరైతే పక్కా యోగులుగా ఉంటారో, ఎవరైతే యోగబలం ద్వారా తమ సర్వ కర్మేంద్రియాలనూ శీతలముగా చేసుకున్నారో, ఎవరైతే యోగములోనే ఉండేందుకు కృషి చేస్తూ ఉంటారో, వారిని మాయ కొద్దిగా కూడా విసిగించలేదు. ఎప్పుడైతే మీరు పక్కా యోగులుగా అవుతారో అప్పుడు అర్హులుగా అవుతారు. అర్హులుగా అయ్యేందుకు పవిత్రత ప్రధానమైనది.

ఓం శాంతి. మధురాతి మధురమైన పిల్లలకు తండ్రి కూర్చొని అర్థం చేయిస్తారు. అజ్ఞానం కారణముగా మీ ఆత్మ డల్ గా అయిపోయింది. వజ్రములో ప్రకాశము ఉంటుంది కదా, రాయిలో ఆ ప్రకాశము ఉండదు, కావుననే రాయిలా డల్ గా అయిపోయింది అని అంటారు. మళ్ళీ ఆత్మ మేల్కొంటే పారసమణిలా ఉంది అని అంటారు. ఇప్పుడు అజ్ఞానం కారణముగా ఆత్మ జ్యోతి డిమ్ అయిపోయింది, అది నల్లగా అయిపోదు, పేరుకు అలా అంటారు. అందరి ఆత్మా ఒకేలా ఉంటుంది, శరీరాల నిర్మాణము అనేక రకాలుగా ఉంటుంది. ఆత్మ అయితే ఒకేలా ఉంటుంది. మనం ఒక ఆత్మ అని, ఆ తండ్రి పిల్లలమని ఇప్పుడు మీరు అర్థం చేసుకున్నారు. ఈ జ్ఞానమంతా ఉండేది, అది మళ్ళీ మెల్లమెల్లగా పోయింది. అలా తగ్గిపోతూ, తగ్గిపోతూ చివరకు ఏమీ మిగలదు, అప్పుడు దానిని అజ్ఞానం అని అంటారు. మీరు కూడా అజ్ఞానులుగా ఉండేవారు. ఇప్పుడు జ్ఞానసాగరుని ద్వారా జ్ఞానులుగా అవుతూ ఉంటారు, ఆత్మ అయితే చాలా సూక్ష్మమైనది. అది ఈ కనులకు కనిపించదు. తండ్రి వచ్చి అర్థం చేయిస్తారు, వారు పిల్లలను నాలెడ్జ్ ఫుల్ గా తయారుచేస్తారు, మీరు సుజాగృతులవుతారు. ఇంటింటిలోనూ ప్రకాశం నిండుతుంది. ఇప్పుడు ప్రతి ఇంటిలోనూ అంధకారము ఉంది అనగా ఆత్మ డిమ్ అయిపోయింది. ఇప్పుడు తండ్రి చెప్తున్నారు, నన్ను స్మృతి చేసినట్లయితే ఆ ప్రకాశము వచ్చేస్తుంది, మళ్ళీ మీరు జ్ఞానవంతులుగా అయిపోతారు. తండ్రి ఎవరి గ్లానినీ చేయరు, వారు డ్రామా రహస్యాన్ని అర్థం చేయిస్తారు. వీరంతా మందబుద్ధి కలవారిగా అయిపోయారు అని పిల్లలతో అన్నారు కదా. అలా ఎవరంటారు? తండ్రి. పిల్లలూ, మీ బుద్ధి శ్రీమతం ద్వారా ఎంత సుందరముగా అయ్యింది. ఇప్పుడు మీరు అనుభవం చేస్తున్నారు కదా. మీకు జ్ఞానం లభించింది. జ్ఞానాన్ని చదువు అని అంటారు. తండ్రి చదివించే చదువు ద్వారా మన జ్యోతి వెలిగింది, దీనినే సత్యాతి-సత్యమైన దీపావళి అని అంటారు. బాల్యములో మట్టి ప్రమిదలో నూనెను వేసి జ్యోతిని వెలిగించేవారు. ఆ ఆచారం నడుస్తూ ఉంటుంది. దాని ద్వారానేమీ దీపావళి జరగదు. ఇక్కడ ఆత్మ ఏదైతే లోపల ఉందో అది డిమ్ అయిపోయింది. ఆత్మ జ్యోతిని తండ్రి వచ్చి వెలిగిస్తారు. వారు వచ్చి పిల్లలకు జ్ఞానాన్ని ఇస్తారు, చదివిస్తారు. స్కూల్లో టీచర్ చదివిస్తారు కదా. అది హద్దులోని జ్ఞానం, ఇది అనంతమైన జ్ఞానం. ఎవరైనా సాధు-సన్యాసులు ఇలా చదివిస్తారా! రచయిత మరియు రచన యొక్క ఆదిమధ్యాంతాల జ్ఞానాన్ని ఎప్పుడైనా విన్నారా? ఎప్పుడైనా ఎవరైనా వచ్చి చదివించారా? ఈ జ్ఞానాన్ని ఇంకెక్కడైనా చదివిస్తారేమో వెళ్ళి చూడండి. కేవలం ఒక్క తండ్రే చదివిస్తారు కావున వారి వద్ద చదువుకోవాలి. తండ్రి అనాయాసముగానే వచ్చేస్తారు. నేను వస్తున్నాను అని వారు దండోరా ఏమైనా వేయిస్తారా. అనాయాసముగానే వచ్చి ప్రవేశిస్తారు. ఎప్పటివరకైతే వారికి ఇంద్రియాలు లభించవో అప్పటివరకూ వారు శబ్దాన్ని చేయనే చేయలేరు. ఆత్మ కూడా ఇంద్రియాలు లేకుండా శబ్దం చేయలేదు, ఎప్పుడైతే శరీరములోకి వస్తుందో అప్పుడే శబ్దం చేస్తుంది. మీరు అర్థం చేయిస్తే ఎవ్వరూ ఒప్పుకోరు. పిల్లలకు ఎప్పుడైతే ఈ జ్ఞానాన్ని ఇవ్వడం జరుగుతుందో అప్పుడు అర్థం చేసుకుంటారు. ఈ జ్ఞానాన్ని ఒక్క తండ్రి తప్ప ఇంకెవ్వరూ ఇవ్వలేరు. వినాశన సాక్షాత్కారాన్ని కూడా ఎవరూ కోరుకోరు. దానిని తండ్రే వచ్చి చేయిస్తారు. డ్రామా అనుసారంగా పాత ప్రపంచం ఇప్పుడు అంతమవ్వనున్నది. కొత్త ప్రపంచం స్థాపన అవుతోంది. ఎవరైతే తండ్రి నుండి జ్ఞానాన్ని తీసుకోవలసి ఉంటుందో వారు వస్తూ ఉంటారు. ఎంతమందికి జ్ఞానాన్ని ఇచ్చి ఉంటారు? లెక్కలేనంతమందికి. ప్రతి ఊరు నుండి ఎంతమంది వస్తూ ఉంటారు. ఈ ఆత్మలు మరియు పరమాత్మ మేళ ఒకేసారి జరుగుతుంది. వారు సంగమయుగములోనే వస్తారు. తండ్రి వచ్చి కొత్త ప్రపంచ స్థాపనను చేస్తారు, ఎవరి జ్యోతినైతే వెలిగిస్తారో వారు మళ్ళీ వెళ్ళి ఇతరుల జ్యోతిని వెలిగిస్తారు. ఇప్పుడు మీరందరూ తిరిగి వెళ్ళాలి. ఇందులో బుద్ధిని ఉపయోగించవలసి ఉంటుంది. భక్తి మార్గములోనైతే అంధకారము ఉంది. జ్ఞానాన్ని ఇచ్చే ఒక్క తండ్రి కావాలి. వారు సంగమయుగములోనే వస్తారు. పాత ప్రపంచములో జ్ఞానం లభించదు. ఇప్పుడు ఇంకా 40,000 సంవత్సరాలు ఉన్నాయి అని మనుష్యుల బుద్ధిలో ఉంది, పూర్తిగా ఘోర

అంధకారములో ఉన్నారు. 40,000 సంవత్సరాల తర్వాత భగవంతుడు వస్తారు అని భావిస్తారు. తప్పకుండా వారు వచ్చి జ్ఞానాన్ని ఇచ్చి సద్గతిని ఇస్తారు అనగా అంతకుముందు అజ్ఞానమన్నట్లే కదా. దీనిని అజ్ఞానాంధకారము అని అంటారు. అజ్ఞానంలో ఉన్నవారికి జ్ఞానం కావాలి. భక్తిని జ్ఞానం అని అనరు. ఆత్మలో జ్ఞానం లేదు కానీ బుద్ధి మందబుద్ధిగా ఉన్న కారణముగా భక్తియే జ్ఞానం అని భావిస్తారు. ఒకవైపేమో జ్ఞానసూర్యుడు రావడంతో ప్రకాశం వస్తుంది అని అంటారు, కానీ ఏమీ అర్థం చేసుకోరు. జ్ఞాన సూర్యుడు ఉదయించారు... అని గానం చేస్తారు. జ్ఞాన సూర్యుడు అని ఎవరి గురించి అంటారు, వారు ఎప్పుడు వచ్చారు - ఇది ఎవ్వరికీ తెలియదు. పండితులు మొదలైనవారు ఉంటే వారు అంటారు, ఎప్పుడైతే కలియుగము పూర్తి అవుతుందో అప్పుడు ప్రకాశము వస్తుంది అని. ఈ విషయాలన్నింటినీ తండ్రి వచ్చి అర్థం చేయిస్తారు. పిల్లలు నంబరువారుగా అర్థం చేసుకుంటారు. టీచర్ పిల్లలను చదివిస్తారు, కానీ పిల్లలు ఒకే విధంగానైతే చదువుకోరు. చదువులో ఒకే విధమైన మార్కులు ఎప్పుడూ రావు.

అనంతమైన తండ్రి వచ్చి ఉన్నారని మీకు తెలుసు. ఇప్పుడు పాత ప్రపంచ వినాశనం కూడా ఎదురుగా నిలిచి ఉంది. ఇప్పుడే తండ్రి నుండి జ్ఞానాన్ని తీసుకోవాలి మరియు యోగాన్ని కూడా నేర్చుకోవాలి. స్మృతి ద్వారానే వికర్మలు వినాశనమవుతాయి. తండ్రి అంటారు, ఈ సంగమయుగములోనే వచ్చి ఈ శరీరాన్ని అద్దెకు తీసుకుంటాను అనగా ప్రకృతి ఆధారాన్ని తీసుకుంటాను. గీతలో కూడా ఈ పదాలున్నాయి. బాబా ఇంకే శాస్త్రము పేరునూ తీసుకోరు. ఒకే గీత ఉంది. ఇది రాజయోగము యొక్క చదువు. దీనికి గీత అన్న పేరును పెట్టారు. ఇందులో మొట్టమొదట భగవానువాచ అని వ్రాయబడి ఉంది. మరి భగవంతుడు అని ఎవరిని అంటారు? భగవంతుడైతే నిరాకారుడు, వారికి తమ శరీరము లేదు. అది నిరాకారీ ప్రపంచము, అక్కడ ఆత్మలు ఉంటాయి. సూక్ష్మవతనాన్ని ప్రపంచము అని అనరు. ఇది స్థూలమైన సాకార ప్రపంచము, అది ఆత్మల ప్రపంచము. ఆట అంతా ఇక్కడ నడుస్తోంది. నిరాకారీ ప్రపంచములో ఆత్మలు ఎంత చిన్న-చిన్నవిగా ఉంటాయి, మళ్ళీ పాత్రను అభినయించేందుకు వస్తాయి. ఈ ఆలోచనలను పిల్లలైన మీ బుద్ధిలోనే కూర్చోబెట్టడం జరుగుతుంది. దీనినే జ్ఞానం అని అంటారు. వేద-శాస్త్రాలను భక్తి అని అంటారే కానీ జ్ఞానం అని అనరు. మీరు సాధు-సన్యాసులను అంతగా కలవలేదు, బాబాకైతే వారి సాంగత్యము ఎంతో ఉండేది. వారు ఎందరో గురువుల వద్దకు వెళ్ళారు. మీరు ఎందుకు సన్యసించారు, ఇళ్ళు-వాకిళ్ళను ఎందుకు వదిలారు అని వారిని అడిగినప్పుడు, ఏం సమాధానమిచ్చేవారంటే - వికారాల ద్వారా బుద్ధి భ్రష్టమైపోతుంది, అందుకే ఇళ్ళు-వాకిళ్ళను వదిలేసాము అని. అచ్చా, మరి అడవుల్లో ఉంటున్నప్పుడు ఆ ఇళ్ళు-వాకిళ్ళు మళ్ళీ గుర్తుకువస్తూ ఉంటాయా? అని అడిగితే అవును అని చెప్పేవారు. ఒక సన్యాసి అయితే మళ్ళీ తిరిగి ఇంటికి కూడా వెళ్ళిపోయారు అన్నది బాబా చూశారు. ఇవి కూడా శాస్త్రాల్లో ఉన్నాయి. ఎప్పుడైతే వయసు పెరుగుతుందో అప్పుడు మనుష్యులు వానప్రస్థావస్థకు వెళ్ళిపోతారు. చిన్న వయసులో వానప్రస్థాన్ని తీసుకోలేరు. కుంభమేళాలో చాలా చిన్న-చిన్న వారు, వివస్త్రగా ఉండేవారు వస్తారు. అక్కడ వారు మందులు తినిపిస్తారు, వాటి ద్వారా కర్మేంద్రియాలు చల్లబడిపోతాయి. మీదైతే యోగబలం ద్వారా కర్మేంద్రియాలను వశం చేసుకోవడము. యోగబలం ద్వారా వశమవుతూ-వశమవుతూ చివరికి అవి శీతలమైపోతాయి. చాలామంది, బాబా, మాయ ఎంతగానో విసిగిస్తోంది అని అంటారు. అక్కడైతే ఇటువంటి విషయాలేవీ ఉండవు. ఎప్పుడైతే యోగములో మీరు పక్కాగా ఉంటారో అప్పుడే కర్మేంద్రియాలు వశమవుతాయి. కర్మేంద్రియాలు శాంతమైపోతాయి. ఇందులో ఎంతగానో కష్టపడవలసి ఉంటుంది. అక్కడ ఇటువంటి అశుద్ధమైన పనులు ఉండవు. తండ్రి ఇటువంటి స్వర్గధామములోకి తీసుకువెళ్ళేందుకు వచ్చారు. వారు మిమ్మల్ని అర్హులుగా తయారుచేస్తున్నారు. మాయ మిమ్మల్ని అనర్హులుగా చేస్తుంది అనగా స్వర్గము లేక జీవన్ముక్తిధామములోకి వెళ్ళేందుకు అర్హులుగా ఉండరు. కావున తండ్రి కూర్చుని అర్హులుగా తయారుచేస్తారు. అందుకొరకు పవిత్రత ప్రధానమైనది. బాబా, మేము పతితులుగా అయిపోయాము, మీరు వచ్చి మమ్మల్ని పావనులుగా తయారుచేయండి అని పాడుతారు కూడా. పావనులు అనగా పవిత్రులు. అమృతాన్ని వదిలి విషాన్ని ఎందుకు తీసుకోవాలి అన్న గాయనం కూడా ఉంది. దానిని విషము అని కూడా అంటారు, అది ఆదిమధ్యాంతాలూ దుఃఖాన్నిస్తుంది. ఇది కూడా డ్రామాలో రచింపబడి ఉంది. తండ్రి ఎన్ని సార్లు వచ్చారు, వచ్చి పిల్లలైన మిమ్మల్ని కలుసుకున్నారు. మిమ్మల్ని కనిష్ఠుల నుండి ఉత్తమ పురుషులుగా తయారుచేయడం జరుగుతుంది. ఆత్మ పవిత్రముగా ఉంటే ఆయుష్షు కూడా పెరుగుతుంది. ఆరోగ్యము, సంపద మరియు ఆనందము అన్నీ లభిస్తాయి. ఒక్క క్షణములో 21 తరాల కొరకు ఆరోగ్యము, సంపద, ఆనందము లభిస్తాయి అని కూడా మీరు బోర్డుపై వ్రాయవచ్చు. తండ్రి నుండి ఈ వారసత్వము 21 జన్మల కొరకు లభిస్తుంది. కొంతమంది పిల్లలు బోర్డ్ పెట్టేందుకు కూడా భయపడతారు. బోర్డ్ అయితే అందరి ఇళ్ళ ముందు ఉంటుంది. మీరు సర్జన్ పిల్లలు కదా. మీకు ఆరోగ్యము, సంపద, ఆనందము అన్నీ లభిస్తాయి కావున మీరు మళ్ళీ ఇతరులకు ఇవ్వండి. మీరు ఇవ్వగలిగినప్పుడు మరి బోర్డు పై ఎందుకు వ్రాయరు! తద్వారా మనుష్యులు వచ్చి అర్థం చేసుకుంటారు - భారత్ లో

నేటికి 5000 సంవత్సరాల క్రితం ఆరోగ్యము, సంపద ఉండేవి, పవిత్రత కూడా ఉండేది అని. అనంతమైన తండ్రి వారసత్వము ఒక్క క్షణములో లభిస్తుంది. మీ వద్దకు ఎంతోమంది వస్తారు. ఇదే భారత్ బంగారుపిచ్చుకలా ఉండేది, వీరి రాజ్యం ఉండేది అని మీరు కూర్చొని అర్థం చేయించండి. మరి వారేమయ్యారు? 84 జన్మలను మొదట ఇతను తీసుకుంటారు. ఇతను నెంబర్ వన్ కదా, ఇతనే మళ్ళీ చివరిలో వస్తారు. తండ్రి అంటారు, ఇప్పుడు మీ 84 జన్మల చక్రం పూర్తయ్యింది, ఇది మళ్ళీ ప్రారంభమవ్వనున్నది. అనంతమైన తండ్రే వచ్చి ఈ పదవిని ప్రాప్తింపజేస్తారు. వారు కేవలం ఏమంటారంటే, మీరు నన్ను స్మృతి చేసినట్లయితే పావనులుగా అవుతారు. 84 జన్మలను తెలుసుకొని తండ్రి నుండి వారసత్వాన్ని తీసుకోవాలి. కానీ చదువైతే కావాలి కదా.

మిమ్మల్ని స్వదర్శన చక్రధారులు అని అంటారు. కొత్తవారు ఎవరూ అర్థం చేసుకోలేరు. స్వ అని ఆత్మనే అనడం జరుగుతుందని మీకు తెలుసు. పవిత్రముగా ఉన్న ఆత్మలమైన మనము ప్రారంభం నుండి 84 జన్మల చక్రాన్ని తిరిగి వచ్చాము. అది కూడా తండ్రే తెలియజేస్తారు. మీరు మొట్టమొదట శివుని భక్తిని ప్రారంభించారు. మీరు అవ్యభిచారీ భక్తులుగా ఉండేవారు. దీనిని తండ్రి తప్ప ఇంకెవ్వరూ అర్థం చేయించలేరు. తండ్రి అంటారు, మధురాతి మధురమైన పిల్లలూ, మీరు మొట్టమొదట ఈ జన్మను తీసుకున్నారు. ఎవరైనా షావుకారుగా ఉంటే ఇతను ఇంతకుముందు జన్మలో అటువంటి కర్మలను చేసాడు అని అంటారు కదా. ఎవరైనా రోగగ్రస్థులుగా ఉంటే అది గత జన్మల కర్మల లెక్కాచారము అని అంటారు. అచ్చా, ఈ లక్ష్మీ-నారాయణులు ఎటువంటి కర్మలను చేసారు? ఇది తండ్రి కూర్చొని అర్థం చేయిస్తారు. ఇతని 84 జన్మలు పూర్తయ్యాయి, మళ్ళీ ఫస్ట్ నెంబర్ లోకి రావాలి. భగవంతుడు సంగమయుగములోనే వచ్చి రాజయోగాన్ని నేర్పిస్తారు. బాబా మనకు రాజయోగాన్ని నేర్పిస్తున్నారని ఇప్పుడు మీరు అర్థం చేసుకుంటున్నారు. అయినా కానీ మీరు మర్చిపోతారు. కర్మ, అకర్మ మరియు వికర్మల గుహ్యగతులను కూడా తండ్రి అర్థం చేయించారు. రావణరాజ్యములో మీ కర్మలు వికర్మలుగా అయిపోతాయి. అక్కడ కర్మలు అకర్మలుగా ఉంటాయి. అక్కడ అసలు రావణ రాజ్యమే ఉండదు, వికారాలు ఉండవు. అక్కడ యోగబలమే ఉంటుంది, ఆ యోగబలం ద్వారా మనం విశ్వాధిపతులుగా అవుతాము, అందుకే తప్పకుండా పవిత్ర ప్రపంచం కూడా కావాలి. పాత ప్రపంచాన్ని అపవిత్రమైనదని, కొత్త ప్రపంచాన్ని పవిత్ర ప్రపంచము అని అంటారు. అది నిర్వికారీ ప్రపంచము, ఇది వికారీ ప్రపంచము. తండ్రే వచ్చి వేశ్యాలయాన్ని శివాలయంగా తయారుచేస్తారు. సత్యయుగము శివాలయము. శివబాబా వచ్చి మిమ్మల్ని సత్యయుగము కొరకు అర్హులుగా తయారుచేస్తున్నారు. లక్ష్మీ-నారాయణుల మందిరంలోకి వెళ్ళి మీరు ఇలా అడుగవచ్చు - వీరు ఈ పదవిని ఎలా పొందారో, వీరు విశ్వాధిపతులుగా ఎలా అయ్యారో మీకు తెలుసా? తండ్రి అంటారు, ఇది మీకు తెలియదు, నాకు తెలుసు. ఆ తండ్రి పిల్లలైన మీరే ఇలా అనగలరు - వీరు ఆ పదవిని ఎలా పొందారో మేము చెప్పగలము అని. వీరే పూర్తి 84 జన్మలను తీసుకున్నారు, మళ్ళీ పురుషోత్తమ సంగమయుగములో వచ్చి తండ్రి రాజయోగాన్ని నేర్పించారు మరియు రాజ్యాన్ని ఇచ్చారు. దానికంటే ముందు నెంబర్ వన్ పతితులుగా ఉండేవారు, మళ్ళీ నెంబర్ వన్ పావనులుగా అయ్యారు. మొత్తం రాజధాని అంతా ఉంది కదా. మీ చిత్రాలలో వీరికి రాజయోగాన్ని ఎవరు నేర్పించారో అంతా స్పష్టముగా ఉంది. ఉన్నతోన్నతమైనవారు పరమాత్మయే. దేవతలైతే నేర్పించలేరు, భగవంతుడే నేర్పిస్తారు, వారిని నాలెడ్జ్ ఫుల్ అని అంటారు. అలాగే తండ్రి, శిక్షకుడు, సద్గురువు అని కూడా అంటారు.

ఎవరైతే ప్రారంభం నుండి శివుని భక్తిని చేసి ఉంటారో వారే ఈ విషయాలను అర్థం చేసుకోగలుగుతారు. మందిరాలను నిర్మించేవారిని మీరు అడగండి - మీరు ఈ మందిరాలను తయారుచేసారు కానీ వీరు ఈ పదవిని ఎలా పొందారు? వీరి రాజ్యం ఎప్పుడు ఉండేది? మళ్ళీ వీరు ఏమయ్యారు? ఇప్పుడు వీరు ఎక్కడ ఉన్నారు? మీరు 84 జన్మల కథను వినిపించినట్లయితే వారు చాలా సంతోషిస్తారు. చిత్రాలు పాకెట్ లో ఉండాలి. మీరు ఎవరికైనా అర్థం చేయించవచ్చు. ఎవరైతే మొదటి నుండి శివుని భక్తిని చేసి ఉంటారో వారు వింటూ ఉంటారు, సంతోషిస్తూ ఉంటారు. వీరు మన కులానికి చెందినవారు అని మీకు అర్థమైపోతుంది. రోజురోజుకు బాబా చాలా సహజమైన యుక్తులను తెలియజేస్తారు. పరమపిత పరమాత్మయే సర్వుల సద్గతిదాత అని మీకు ఇప్పుడు అర్థమయ్యింది. 21 జన్మల కొరకు సత్యయుగ రాజ్యాధికారము లభిస్తుంది. 21 జన్మల వారసత్వము ఈ చదువు ద్వారానే లభిస్తుంది. టాపిక్ లు కూడా ఎన్నో ఉన్నాయి. వేశ్యాలయము మరియు శివాలయము అని దేనినంటారు? ఈ టాపిక్ పై మనం పరమపిత పరమాత్ముని జీవితగాథను తెలుపవచ్చు. లక్ష్మీ-నారాయణుల 84 జన్మల కథ, ఇది కూడా ఒక టాపిక్. విశ్వములో శాంతి ఎలా ఉండేది, మళ్ళీ అశాంతి ఎలా ఏర్పడింది, ఇప్పుడు మళ్ళీ శాంతి ఎలా స్థాపన అవుతూ ఉంది - ఇది కూడా ఒక టాపిక్. అచ్చా!

మధురాతి-మధురమైన సికీలధే పిల్లలకు మాత-పిత బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. ఇప్పుడు ఉత్తమ పురుషులుగా అయ్యేందుకు స్మృతి బలము ద్వారా ఆత్మను పవిత్రముగా తయారుచేసుకోవాలి, కర్మేంద్రియాలతో ఎటువంటి వికర్మలనూ చేయకూడదు.

2. జ్ఞానవంతులుగా అయి ఆత్మలను సుజాగృతులుగా చేసే సేవను చేయాలి. ఆత్మ రూపీ జ్యోతిలో జ్ఞాన-యోగాలనే నూనెను వేయాలి. శ్రీమతము ఆధారంగా బుద్ధిని స్వచ్ఛముగా తయారుచేసుకోవాలి.

వరదానము:- పాయింట్ స్వరూపములో స్థితులై మనసు-బుద్ధిని నెగెటివ్ ప్రభావము నుండి సురక్షితంగా ఉంచుకునే విశేష ఆత్మా భవ

ఏదైనా సీజన్ ఉన్నప్పుడు, ఆ సీజన్ నుండి రక్షించుకునేందుకు దాని అనుసారంగా అటెన్షన్ పెట్టడం జరుగుతుంది. వర్షం వచ్చిందంటే గొడుగు, రైన్ కోట్ మొదలైనవాటిపై అటెన్షన్ పెడతారు. చలికాలం వచ్చిందంటే వెచ్చగా ఉంచే వస్త్రాలను పెట్టుకుంటారు... అలాగే వర్తమాన సమయములో మనసు-బుద్ధిలో నెగెటివ్ భావాలను మరియు భావనలను కలుగజేసే విశేష కార్యాన్ని మాయ చేస్తూ ఉంది, అందుకే విశేషమైన సురక్షా సాధనాలను ఉపయోగించండి. ఇందుకు సహజ సాధనము - ఒక్క పాయింట్ స్వరూపములో స్థితులవ్వటము. ఆశ్చర్యార్థకము మరియు ప్రశ్నార్థకములకు బదులుగా బిందువు పెట్టడము అనగా విశేష ఆత్మగా అవ్వటము.

స్లోగన్:- ఆజ్ఞాకారీ ఎవరంటే ఎవరైతే ప్రతి సంకల్పము, మాట మరియు కర్మలో జీ హాజుర్ (చిత్తం ప్రభు) అంటారో వారు.